# గృహలక్ష్మి

పిల్లిలా లోపలి కొచ్చేసింది మాధురి.

ముందు గదిలో మామగారు ఇంకా కబుర్లలో ఉన్నారు. ఆప్త మిత్రుడు గోవిందరావు. ఎప్పుడొచ్చినా వదలడు. ఏముంటాయో విశేషాలు. ఇద్దరూ రిటైర్డ్ పక్షులు. నైన్‌టీన్ ఫిఫ్టీ టూ లో.... సెవెన్‌టీ ఫైవ్ లో...అంటూ చరిత్రలు చెప్పుకుంటారు. కాలక్షేపం కబుర్లు. అంతే వాళ్ళ ప్రపంచం.

బెడ్‌రూం లోకి వచ్చి కూచున్నాక మాధురికి కొంచెం నెమ్మదిగా అనిపించింది.

పక్క వాటా అబ్బాయి ఎర్రగా, నాజూగ్గా ఎంత దర్జాగా ఉన్నాడు! ఎందుకలా నవ్వుతాడు తనని చూసి!

తను డాబా మీద బట్టలు ఆరేస్తుండగా చదువు ఆపేసి కిటికీ లోంచి చూస్తూ ఉండి పోయాడు. రవిక బిగువు, పైట రెపరెప...నడుము నుంచి నిలవకుండా దొర్లి పోయేంత నాజూకు చీర కట్టు...అన్నీ కళ్ళతో తాగే సేట్టు చూస్తుండి పోయాడు.

వారం రోజులుగా ఇదే వరస. డాబా మీద తను బట్టలు ఆరెయ్యడం, అతను కళ్ళతో కవ్వించడం. ఇవాళ మరీ తెగించేశాడు. తను కనబడ గానే టక్కున పుస్తకం మూసేసి... సూటిగా తనకేసి చూసి కళ్ళెగరేశాడు...ఎంత ధైర్యం!

పెళ్ళయిన దాన్నని తెలీదా?

లంకె బిందె ల్లాంటి పరువాల వంటల్ని కాపలా కాస్తున్నట్లుగా నల్ల తాచు లాంటి మంగళ సూత్రం వ్రేలాడు తుండగానే...!

గుండెల మీద చెయ్యి వేసుకుని కళ్ళు మూసుకుంది మాధురి. అతని కంత ధైర్యం ఎక్కణ్ణుంచి వచ్చింది? అతను తనని చూస్తున్నట్టు తను గమనించిన తర్వాత కూడా అతని కళ్ళ బడేట్టు తిరగడం లేదూ!

తప్పు తప్పు తప్పంటూ కొట్టుకుం టోంది గుండె. ఏదో తెలియని ఆరాటం.

చూపులే కదా! చూస్తే ఏమిటని ఏదో ఆశ.

భర్త గోపీ అందగాడే. మంచివాడు. చక్కగా చూసుకుంటున్నాడు. ఏ లోటూ లేదు. ఏడాది దాటిన కాపురంలో ఏ అపశృతీ లేదు.

మామగారు కుటుంబయ్య సాక్షాత్తూ దేవుడే. ఆయన భార్య ఐదేండ్ల క్రితం కన్ను మూసింది. ఒక్కడే కొడుకు. ఇల్లే వైకుంఠంగా రిటైర్డ్ జీవితాన్ని కులాసాగా గడిపేస్తున్నాడు ఆయన.

ఇంటికి తను శ్రీలక్ష్మీదేవిని అంటాడు.

వంటింట్లో శబ్దమైతే ఉలిక్కి పడి లేచి వెళ్ళింది మాధురి. పిల్లి...ఏదో గిన్నె నాకేసి వెళ్ళి పోతోంది. అది తను పెట్టిన గిన్నె కాదు. పాలు ఆ గిన్నెలో ఎలా మిగిలాయా అనుకుంటూ ఉండగా సరిగ్గా అప్పుడే హాలులో మెదిలాడు కుటుంబయ్య.

"ఇందాకా మా గోవిందుడికీ... నేనే కాసిని పాలు కాచి ఇచ్చా లేమ్మా. పాపం నువ్వెక్కడో పై నున్నావుగా...అప్పటికీ పిలిచి చూశా...సరే నని..."

చివుక్కు మంది.

మామగారికి అందుబాటులో లేకుండా తను డాబా మీద ఏం చేస్తోంది?

భర్త ఎక్కడో పేపర్ ఆఫీస్‌లో చాకిరీ చేస్తుండగా తనిక్కడ ఏం చేస్తోంది?

తప్పు త ప్పంటోంది మెదడు.

సరే కానీ సరే కానీ అంటోంది మనసు. పక్క వాటా అబ్బాయి అంత అందంగా ఉన్నాడు!

గోపీ పని చేస్తున్నది డైలీ పేపర్. రోజూ ఇబ్బందే. అయితే మిడిల్ డ్యూటీ. లేకుంటే నైట్.

మధ్యాహ్నం వెళ్తే రాత్రి పదింటికి వస్తాడు. సాయంత్రం వెళ్తే అర్ధ రాత్రి దాటాక ఒంటి గంటకో రెండింటికో వస్తాడు.

ఒక్కో సారి తెల్లారి పోతుంది. కరెంటు పోయినా ఎన్నికలో వరదలో గొడవలో ఏ దొచ్చినా పేపర్ వాళ్ళకి శివరాత్రే.

అయినా తప్పదు. బ్రతుకు తెరువు. గోపీకి ఇంట్రెస్టు. గొప్ప ప్రొఫెషన్ అంటాడు.

తనకు ప్రతి సాయంత్రం బోర్. అందరూ సినిమాలకూ షికార్లకూ

వెళ్తుంటే తను మాత్రం ఒంటి పిల్లి లా ఇంట్లోనే తిరగాలి. ఇదే లోటు. ఈ లోటు బరువెక్కు తుండగా పక్కింటి అబ్బాయి కంట బడ్డాడు. కంటికి ఇదో మోజు. ఏదో ఆకర్షణ...

మామగారు ముందు గది లోకి వెళ్ళి పోగానే హాల్లోకి వచ్చింది మాధురి. ప్రతి రాత్రీ ఇదే అలవాటు. రాత్రి భోజన మయ్యాక ఆయన హాల్లో కాస్సేపు టీవీ చూస్తూ కూచుంటాడు. ఆయన ఉండగా మాధురి కుర్చీలో అక్కడ కూచోదు. భయమూ భక్తీ. అలా గని ఆయన మీద విసుగు లేదు.

విశాలమైన నుదురు, తెల్లటి జుత్తు, పండిన మీసాలు, నుదుటన గంధం బొట్టు... కుటుంబయ్యను చూడగానే విపరీతమైన గౌరవ భావం కలుగుతుంది.

జీవితంలో పండి పోయిన మనిషి. ఆయన ముందు ఊపిరి పీల్చా లన్నా భయమే!

ముందు గదిలో ఆయన సెటిల్ అయిన కాస్సేపటికే సన్నటి గురక శబ్దం వినిపించింది.

అమ్మయ్య అనుకుంది మాధురి. కాళ్ళు చాచుకుని ఈజీ ఛెయిర్‌లో జారగిలబడి టీ వీ చూస్తోంది.

ఆమె దృష్టి టీవీ మీద ఉన్నా మనసు అప్పుడప్పుడూ డాబా మీదికి లాగుతోంది...

ఎంత అందంగా ఉన్నాడా అబ్బాయి! ఎం.ఎస్.సి. ఫిజిక్స్ కాబోలు చదువు తున్నాడు. కింది ఇంటి ఆంటీ మొన్న కబుర్ల మధ్య చెప్పింది. చాలా తెలివైన వాడట.

చాలా తుంటరివాడు కూడా. ఆ సంగతి తనకే తెలుసు. అదీ తన ఇంట్రెస్ట్ కదూ?

అంత బుద్ధిగా చదివే కుర్రాడు తను కనిపిస్తే పుస్తకం మూసేస్తాడు. ఎందుకు?

టీవీ కట్టేసినా మనసులో బొమ్మలు కదులు తున్నాయి. అన్ని బొమ్మల్లో ఒకటే ముఖం. ఎర్రటి ముఖం. తెల్లటి నవ్వు. ఎంత ధైర్యం!

పక్క కుదరదు. నిద్ర పట్టదు. ఏదో ఊహ. చిలిపిగా, అల్లరిగా.

మెల్లగా లేచి వెళ్ళింది.

కాళ్ళు ఆటోమేటిక్‌గా వెళ్తున్నాయి.

మనసు వశం తప్పితే అదో గమ్మత్తు. మెదడు పని చెయ్యదు. మనసు

కూడా గప్‌చుప్.

అవయవాలు స్వతంత్రిస్తాయి. కళ్ళు, కాళ్ళు, చేతులు...వాటికే స్వంత బుద్ధి ఉన్నట్టు ప్రవర్తిస్తాయి.

హాలు దాటి ఆగింది మాధురి.

ముందు గది లోంచి గురక. గాఢ నిద్ర. కుటుంబయ్య మనసు చాలా మంచిది. అందుకే వెంటనే నిద్ర పోతాడు.

గ్రిల్ తలుపు తీసింది మాధురి. క్రైం పిక్చర్‌లో లాగా అనిపించింది. ఎవరైనా చూస్తారేమో! చూస్తేనేం? తన ఇల్లు, తన తలుపు, ఇంటి డాబాయే. పైకెళ్తేనేం?

గుండె మోత చెవుల్లో మోగుతుండగా ఒక్కో మెట్టూ ఎక్కింది...ఎవరెస్టు ఎక్కినట్టు.

డాబా మీద ఫెళ్ళున లైటు.

అతను కుర్చీ వేసుకుని సీరియస్‌గా చదువుకుం టున్నాడు. మాధురి వెళ్ళ గానే గబుక్కున పుస్తకం మూసేశాడు. తెల్లగా నవ్వాడు.

ఓర కంట చూసింది మాధురి. చూడ నట్టే తల తిప్పుకుంటూ డాబా మీద చివరి దాకా నడిచింది.

అద్దె ఇంట్లో అందరికీ హక్కుంది. తప్పేమిటి?

"హలో!" అన్న శబ్దంతో అదిరి పడింది!

అతనే తననే పలకరించాడు!

గుండె ఒక్క సారిగా గెంతింది. గొంతు పూర్తిగా తడి ఆరి పోతుండగా ఏమి టన్నట్టు చూసింది.

"పాపం బోర్ కొడుతు న్నట్టుంది మీకు..." అన్నా డతను ఆమె మనసును పూర్తిగా చదివేసినట్టు.

"అబ్బె...అదేం లేదు ...లేదండీ..." అనేసి గబగబా మెట్లు దిగి వచ్చేసింది మాధురి.

తలుపు మూసి లోపలి కెళ్ళి గుండెల మీద చెయ్యి వేసుకుని ...బాబోయ్...అనుకుంది.

పెద్ద ఘోరమేమీ కాదు. చిన్న పలకరింపే! అది ప్రణయమా? ప్రళయమా? స్నేహమా? లేక ఏమీ కాని వట్టి పలకరింపేనా?

ముందు గది లోంచి మామగారి గురక ఆగిందా? ప్రపంచంలో ఏ

శబ్దాలూ వినిపించడం లేదు. ఆ అబ్బాయి గొంతే ప్రతిధ్వనిస్తోంది. "హలో!..."

లోయ లోంచి ప్రతిధ్వనిలా..." లో..." అంటూ...

ప్రతిధ్వనిలో మతి పోయినట్టు నిద్ర ఎప్పుడు కమ్మిందో గుర్తే లేదు. గోపీ ఎన్ని గంటలకి వచ్చాడో తనెలా వెళ్ళి తలుపు తీసిందో కూడా గుర్తు లేదు. కొంప దీసి పక్కింటి అబ్బాయే వచ్చి తలుపు కొట్టా డేమో! తను నిస్సంకోచంగా తలుపు తీసిం దేమో! అతను నిర్మొహమాటంగా లోపలి కొచ్చేశా డేమో!

వచ్చిన వాడు ఎవరో అయితే అంత స్వంతంగా అంత స్వతంత్రంగా ఉంటాడా తన తోటి?

నల్లటి చీకటిలో ఎర్రటి మొహం మెదుల్తూ తెల్లటి నవ్వు మెరుస్తూ మైమరిపిస్తూ మహిమ చూపిస్తుండగా ఆత్రంగా ఆప్తంగా పొదువుకుంది మాధురి.

బరువుగా నిట్టూర్చే వేళ గోపీ చాలా అపురూపంగా అన్నాడు "ఏంట్రా మధూ ఇవాళ విశేషం?...గొప్పగా ఉన్నావూ?..."

అప్పుడు గానీ తెలీ లేదు గోపీ అని.

ఒళ్ళు మరచి అతను నిద్ర పోతుండగా ఆమె మనసులో మెదిలిందో శబ్దం.

"పాపం...ఛీ...తప్పు..."

మాట్లాడితేనే తప్పయి పోతుందా? గోపీ కేం? ఆఫీస్‌కి వెళ్తే బోలె డంత కాలక్షేపం. మామగారయితే గోవిందరావుతో గంటల తరబడి కబుర్లు చెప్పుకుంటారు. తనకు ఇరుగు పొరుగు ఆడవా ళ్ళందరితో పరిచయా లైతే పెరిగాయి గాని పెద్దగా స్నేహం లేదు. అదీ గాక టైము కుదరదు.

అందరూ ఆఫీస్‌లకి వెళ్ళే వేళ గోపీ ఇంట్లో ఉంటాడు. అందరూ ఇంట్లో ఉండే వేళ అతనికి డ్యూటీ. అలా కుదిరింది. తనకే బోర్. పక్కిం టబ్బాయితో కాస్సేపు కబుర్లు చెప్తే తప్పేంటి?

"మీ పేరు మాధురి కదూ? బ్యూటిఫుల్ నేమ్! నా పేరు శేఖర్...ఎమ్మెస్సీ ఫైనల్!... మీవారు నిజంగా అదృష్టవంతులు తెలుసా?" అతను చాలా ఫ్రీగా మాట్లాడే స్తుంటే ప్రియంగా వింటోంది మాధురి.

అతని గొంతులో ఏదో మంత్రశక్తి ఉంది.

సాయంత్రం ముదిరి చీకటి చిక్కబడు తుండగా ఉలిక్కి పడింది మాధురి. ఆరబెట్టిన గోధుమలు బకెట్‌లో పోసుకుంది. "మీరు భలే మాట్లాడతారు..."

అని అతనికి కితా బిచ్చింది.

"నే వెళ్తా నింక" అని బకెట్‌తో మెట్లు దిగుతుండగా "మీతో స్నేహం దొరకడం నా అదృష్ట మండోయ్!..." అంటున్నా డతను వెనుక నుంచి.

డాబా మీద ఉన్నంత సేపూ స్వర్గంలో ఉన్నట్టే అనిపించింది. కాని మెట్లు దిగొచ్చాక తెలివి తెచ్చుకుని అడుగులో అడుగేస్తూ నడిచింది.

మామగారు ముందు గదిలో కూచుని భాగవతం చదువుకుం టున్నాడు. ఆయన పద్యాలు పైకి చదువుతాడు. చాలా కమ్మగా చదువుతాడు.

పద్యాల్లో పడితే ఆయనకు లోకమే తెలియదు. ఏమీ తెలియదు. కోడలు గోధుమల కోసం డాబా మీదికి వెళ్ళినట్టు కూడా తెలియదు.

ప్రేమ వేరు, సెక్స్ వేరు, స్నేహం వేరు.

స్నేహానికి ఇష్టమే గాని ప్రయోజనం లేదు. ఉండ కూడదు.

ఫలితం కోరేది స్నేహమే కాదు.

కొంప దీసి శేఖర్ తనని కోరుకోవడం లేదు కదా? ఎంత దారుణం!

చను విస్తే మగాళ్ళు నెత్తి కెక్కు తారు.

చనువు ఇవ్వకూడ దనుకుంది మాధురి.

కాని అతనే చనువు తీసుకున్నాడు.

సాయంత్రం యూనివర్సిటీ కబుర్లు ఏవేవో చెబుతూ ఒక ఫోటో ఆల్బం చూపించాడు.

అతని ఫ్రెండ్సూ, క్లాస్‌మేట్సూ తలకోనకి పిక్నిక్ వెళ్ళిన ఫోటోలు అవి.

క్లాస్‌మేట్స్‌లో అందమైన అమ్మాయిలు ఉన్నారు. వాళ్ళందరూ శేఖర్ కోసం ఎగబడతా రట. ఎంత బడాయి!

"కానీ వాళ్లందరి కంటే మీరే బ్యూటిఫుల్‌గా ఉంటారు...ముఖ్యంగా మీ పెదవులు..." అంటూ టక్కున పెదవి మీద చూపుడు వేలితో మీటాడు.

హడలి పోయి గబుక్కున అక్కడి నుంచి వచ్చేసింది. స్నేహంలో కోరికే తప్పు! తనకు తెలుసు. అతనికి తెలీదు. వద్దన్నా మనసు వినదు.

అతను అంత నీటుగా వున్నాడు...అసహనంగా పక్కలో దొర్లుతోంది మాధురి.

గోపీ గోముగా వాటేసు కున్నాడు.

"మధూ! ఒళ్ళంతా నొప్పులు...మునుపటిలా నువ్వు నొక్కడం లేదు. అదోలా ఉన్నావ్.... ఎనీ ప్రాబ్లమ్?..."

అతని చేతులు నొక్కుతూ కళ్ళు మూసుకుంది. ఇంత మంచి భర్తకు ద్రోహం చెయ్యడమా?

శుక్రవారం.

వరలక్ష్మీ పూజకి లేటయి పోయింది.

"అమ్మాయ్... ఇప్పుడే వస్తా నుండు..." అంటూ వెళ్ళిన కుటుంబయ్య ఎంతకీ రాలేదు.

తల స్నానం వల్ల ఉపవాసం వల్ల కొంచెం తల దిమ్ముగా నీరసంగా ఉంది మాధురికి.

ఏది తప్పినా శుక్రవారం వ్రతం తప్పడానికి లేదు. పూజ ముగిసే దాకా ఎవరికీ టిఫిన్లు లేవు.

"న్యూస్ పేపర్ల వాళ్ళకి ఈ రూల్స్ వర్తించవు. ఇలాగైతే నైట్ డ్యూటీలు నడవ్వు... ఎడిషన్లు లేటయి పోతాయి. సర్కులేషన్లు పడిపోతాయి...ఆకలి దంచేస్తోంది. టిఫిన్ ప్లీజ్!..." అని గోల చేసే స్తున్నాడు గోపీ.

అతన్ని ఎలాగో సమాధాన పరుస్తుండగా వచ్చాడు కుటుంబయ్య. ప్రొద్దుటి నీరెండలో నడిచి మెట్లెక్కి రావడం చేత ముఖాన చెమట తేలింది.

పూజ, అర్చన మొదలెట్టింది మాధురి. పావు గంటకి హారతి ఇచ్చింది. కుంకుమ తీసి మంగళసూత్రానికి అద్దుకుంటే అదో పవిత్రత.

లక్ష్మీదేవి పాదాల చెంత నుంచి అక్షింతలు తీసి గోపీ తన మీద చల్లితే అదో నిండు తనం.

జుబ్బా జేబులోంచి మెల్లగా ఓ వస్తువు తీశాడు కుటుంబయ్య. సుతిమెత్తగా గల్లు మనే సవ్వడితో పటంలో ఉన్న లక్ష్మీదేవి నవ్విన ట్లయింది.

వెండి మువ్వలు. సిరిమువ్వలు!

అప్పుడే షాపు నుంచి తెచ్చా దన్నమాట!

కొడుకు చేతిలో మువ్వల పట్టీలు పెడుతుండగా ఆయన గొంతు వణికింది.

"రాత్రి మీ అమ్మ కలలో కనిపించి కేక లేసిందిరా... కోడ లొచ్చినా ఇల్లింత దిగులుగా బోసి పోవాల్సిందేనా అని...నా పింఛను డబ్బుతో కొన్నానురా.... ఇవ్వు... అమ్మాయి కివ్వు..."

"అదేంటి నాన్నా మీ డబ్బు అని ఏమిటి? నాతో ఒక మాట చెప్పి

ఉంటే..."

"పేపర్లో నాలు గక్షరాలు గిలుకుతావు గానీ పెళ్ళానికేం కావాలో నీకేం తెలుసు? నేను చెప్పాలా నువ్వు తేవాలా?...సరే...ముందవి పెట్టుకొమ్మను అమ్మాయిని...సంతాన లక్ష్మి కలిసి...నా మనవడు మువ్వ లేసుకుని పాకే దాకా కనీసం ఇవన్నా ఉండాలి... అమ్మాయ్! శుక్రవారం నాడిస్తున్నాను ... మరవొద్దు....ఎటువంటి పరిస్థితిలో కూడా నువ్వు కాలి మువ్వలు తీయ కూడదు...తీశావో మీ అత్తగారి మీద ఒట్టే సుమా!..." అన్నాడు కుటుంబయ్య.

వెండి మువ్వలు గల్లుగల్లు మని నవ్వాయి...ఆయన అభిమానంలా...

పాలవాడు వాకిట్లో కొచ్చి కాలింగ్ బెల్ నొక్కుతూ తెగ న్యూసెన్స్ చేసేవాడు. ఇప్పుడు మానేశాడు. "ఎందుకూ! లోపల్నుంచి మీ రొస్తున్నట్టు తెలుస్తున్నా దండి" అన్నాడు.

కూరలమ్మ గొంతెత్తి పిలవడం మానేసింది. "మువ్వలేసుకుని మీ రొస్తావుంటే కనకదుర్గమ్మో కామాక్షమ్మో వచ్చినట్టేనండి...మరి మాట్లాడ బుద్ధవదు....ఆ సంగీతం ఆలకించా లనిపిస్తుంది. ఒట్టండి..."

కిందింటి ఆంటీ పనిగట్టుకొని పైకొచ్చి పలకరించింది. "కొందరు గజ్జె లేసుకుని నడిస్తే తన్న బుద్ధేస్తుంది. మామూలుగా నీ కాళ్ళ శబ్దమే తెలీదు. ఇవేసుకుని మీ ఇంట్లో నువ్వు అటూ ఇటూ నడుస్తుంటే కింద నుంచి నాకెట్లా ఉందో తెలుసా? ఆకాశంలో కనిపించని దేవత ఎవరో వెళ్తున్న ట్టుంది..."

మరీ అన్ని పొగడ్తలా? అబద్ధాలా?

అభిమానానికి నోరొచ్చినట్టు అమాయకంగా నవ్వుతున్నాయి మువ్వలు.

మల్లెలకు నోరొచ్చి పాడినట్టు...

సాయంత్రం....

మామగారు ముందు గదిలో చదువుకుం టుండగా నెమ్మదిగా గడప దాటి వరండాలోకి వెళ్ళింది మాధురి.

మువ్వల సవ్వడికి ఆయన చదవడం ఆపి తల తిప్పి చూసిన ట్లనిపిం చింది.

మెట్లెక్కి డాబా మీదికి వెళ్ళా లంటే...భయ మనిపిం చింది. అయినా వెళ్ళింది.

మువ్వల సవ్వడి శేఖర్ని కూడా పలక రించింది. పుస్తకం గిరాటుగా

పక్కన పడేశాడు. కుర్చీలోంచి లేచి ఒక్క ఉదుటున పిట్ట గోడ దగ్గరికి వచ్చాడు. "అప్సరసలా వచ్చారు తెలుసా?..."

మాధురి మనసంతా కిందే వుంది.

డాబా మీద నడవా లన్నా భయం. నడవ కుండా ఊరికే ఉండి పోవా లన్నా భయం. ఆరిన బట్టలు తీసుకుని తొందరగా కిందికి వచ్చేసింది.

శేఖర్‌తో ఎంతెంతో మాట్లాడా లని ఉంది గాని...కాలి మీద మువ్వలు ...నవ్వుతాయి!

చిన్న వస్తువులతో గొప్ప సుఖాలు వస్తాయి.

తెల్లవారు జామున మువ్వలకి సంగీతం వచ్చింది. మూగ మువ్వలు రాగా లందు కున్నాయి. గాజులు గొంతు కలిపాయి. పోటీ పడ్డాయి.

గోపీలో అలసట కూడా ఎగిరి పోయింది. మొట్టమొదటి రాత్రి అనిపించింది.

"మువ్వలు తీసెయ్యనా...అంతా సైలెంట్‌గా ఉంది కదూ!... ఈ మోత మామగారికి వినిపిస్తే బాగుండదు....కింద వాటాలో ఉండే ఆంటీకి కూడా వినిపిస్తుం దేమో!" అంది మాధురి సిగ్గుగా.

"తియ్యొద్దు ప్లీజ్! ఎట్టి పరిస్థితిలో తియ్యొద్దని ఒట్టు వేయించుకో లేదూ నాన్న? ఇట్టి పరిస్థితిలో కూడా!" అంటూ నవ్వుతూ రెట్టించిన ఉత్సాహంతో తన సాహస యాత్ర కానిచ్చాడు గోపీ.

మాధురికి కూడా ఇష్టంగా వుంది.

మువ్వల సవ్వడి మధురంగా వుంది.

మనసైన కాపురం లాగా మనోహరంగా ఉంది.

కళ్ళు నొప్పి తెలిసేటప్పటికి టీవీ కట్టేసింది మాధురి. చాలా రాత్రయి పోయింది.

మామగారు ఎప్పుడో నిద్ర పోయారు. ఒక్క సారి చల్లగాలి కోసం డాబా మీదికి వెళ్ళి రావాలని ఉంది.

తలుపు తీసి వరండా లోకి వెళ్ళిన మాధురికి ఎందుకో చెవుల్లో ముళ్ళు దిగిన ట్టయింది. ముందు గదిలో మామగారి గురక ఆగిన ట్టయింది. మువ్వల సవ్వడికి ఆయనకు నిద్ర చెడితే?

మువ్వలు తీసి అవతల పెట్టేద్దా మనుకుంది గాని మనసు రాలేదు.

శుక్రవారం నాడు పెట్టుకున్న మువ్వలు. వరలక్ష్మీ కటాక్షం.

తీయొద్దని మామగారి ఒట్టు!

ఎందుకు తీయాలి?

డాబా మీదికి వెళ్ళ డానికా! ఎందుకు?

తిరి గొచ్చేసి బెడ్ మీద వాలి పోయింది మాధురి.

కళ్ళు మూసుకుంటే చీకట్లో ఎర్రటి ముఖం కనిపించింది. తెల్లగా నవ్వుతూ శేఖర్ ముఖం.

డాబామీద ఎదురు చూస్తుంటుంది ఆ నవ్వు...

పదిరోజుల తర్వాత...

సాయంత్రం....

కిందింటి ఆంటీతో కాస్సేపు కబుర్లు చెప్పి వస్తుండగా కుడి కాలి మువ్వల పట్టీ తెగింది.

ఒంటి కాలికి పట్టీ బాగుండ దని రెండూ చేతిలో పుచ్చుకుని పై కొచ్చింది మాధురి.

తలుపు తోస్తుండగా 'కోడలుపిల్ల' అనే మాటతో ఆగి పోయింది.

ముందు గదిలో గోవిందరావుతో కబుర్లలో ఉన్నాడు కుటుంబయ్య.

"అరె గోవిందూ...నా కూ్కాడా నెమ్మదిగా ఉందిప్పుడు. కోడలు పిల్ల మహా యోగ్యురాలు. బుద్ధిమంతురాలు. అయినా వయసు బట్టీ అవకాశం బట్టీ మనసు పరిపరి విధాల పోతుం టుంది...ఇదివర కైతే...అమ్మాయి చీటికీ మాటికీ డాబా మీది కెళ్ళేది...పక్కింటి వాళ్ళ కుర్రాడూ అక్కడే చదువుకుంటూ తచ్చాడుతూ ఉంటాడు. వాళ్ళని నేను కావలి కాయాలా? పైకి ఏం చెప్పినా బావుండదూ...ఈ కాలం పిల్లలతో ఏం మాట్లాడినా తప్పే..."

"అందుకని..."

"అందుకనే... కాలికి మువ్వలు తగిలించేశా! తియ్యొద్దని వాళ్ళ అత్తగారి మీద ఒట్టు పెట్టా! దెబ్బకి దెయ్యం దిగింది చూడూ...అమ్మాయి డాబా మీది కెళ్ళడం బాగా తగ్గిపోయింది. వెళ్ళినా అలా వెళ్ళడం...ఇలా రావడం...క్షణం క్షణం మన గృహలక్ష్మి ఎక్కడ మెదిలినా మనకు తెలుస్తూనే ఉంటుం దాయె... డాబా మీద ఇంద్రుడున్నా చంద్రుడున్నా మనకేం ఫరవా లేదు. మన బంగారాన్ని మనం జాగ్రత్తగా చూసుకుంటే చాలు...ఏమంటావ్?"

పెద్దగా నవ్వాడు గోవిందరావు. గొంతు కలిపి నవ్వుతూనే ఉన్నాడు కుటుంబయ్య.

చేతిలో మువ్వల కేసి చూసుకుంది మాధురి. అవి నవ్వడం లేదు. వాటి సవ్వడి మాత్రం గుండెలో మోగుతూనే ఉంది. అమాయకంగా....

06.02.1998 సంచిక